క్లుప్తంగా

జవహర్ నవోదయకు హస్రిక ఎంపిక



భట్టిప్రోలు: జవహర్ నవోదయకు భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పెదపులివర్రు విద్యార్థిని పులివర్తి హస్రిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి బుధవారం తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 12న జరిగిన ఎంట్రన్స్ టెస్ట్‌లో హస్రిక అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు అభినందించారు.

చిరు ధాన్యాలలో పౌష్టికాహారం



వేమూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని సూపర్ వైజర్ రమణమ్మ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నవ ధాన్యాలల్లో పౌష్టికాహారం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సజ్జా లక్ష్మీతిరుతమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



రేపల్లె రూరల్: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పేటేరు జెడ్పీ హైస్కూలులో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి బుధవారం నిర్వహించిన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో విద్యారుథలు పరీక్షలు రాసి సత్ఫలితాలు సాధించి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాలలోని 118 మందికి పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమోహన్, ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్, సభ్యులు నటరాజ్, అయోధ్య, బోస్, రాంబాబు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్ పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నిజాంపట్నం: ఆధారిత ఉత్పత్తుల ద్వారా మత్స్యకార సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. చేపలు, రొయ్యలు యొక్క విలువ ఆధారిత ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తీర ప్రాంతంలో లభ్యమయ్యే మత్స్య సంపద ద్వారా మహిళలు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో చేపలు, రొయ్యల పచ్చడి తయారీ విధానం, ఎండు చేపలు మిషన్‌లో ఎండబెట్టడంపై మహిళలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ యశ్వంత్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి షేక్ కౌసర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ

కర్లపాలెం: సార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఏఎస్ఐ సాంబశివరావు, సంస్థ అధ్యక్షుడు మోపర్తి జాన్, పూర్వ విద్యార్థి నయిముల్లా పాల్గొన్నారు.

4న మండల పరిషత్ సమావేశం

భట్టిప్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షత వహించారు.

రేపు ధ్యాన మందిర ప్రారంభోత్సవం

భట్టిప్రోలు: సాధన మండలి- బ్రహ్మ విద్యాశ్రమంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రజ్ఞానంద సరస్వతి(బాల స్వామిజీ), దాస సాహిత్య ప్రాజెక్ట్ అధ్యక్షులు గడ్డిపాటి వాసు పాల్గొంటారని పేర్కొన్నారు.

బుర్రకథ కళాకారుడు కృష్ణకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం లవకుశ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సీతారామకళ్యాణం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం బుర్రకథ కళాకారుడు దాసరి కృష్ణను ఘనంగా సన్మానించారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి మేరుగ నాగార్జున
- వలివేరులో ఆసరా చెక్కుల పంపిణీ



వలివేరులో ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేసిన మంత్రి మేరుగ నాగార్జున

వలివేరు(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చుండూరు మండలం వలివేరులో ఈమని కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. పథకాన్ని వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు. గతంలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు.. వ్యవసాయం, డ్వాక్రా గ్రూపుల మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. చుండూరు మండలంలో 986 గ్రూపు సభ్యులకు రూ.96 కోట్లు డ్వాక్రా గ్రూపుల సభ్యుల అకౌంట్‌లో జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, గ్రామ సర్పంచి పందిపాటి ఏసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదె శివరామకృష్ణా రెడ్డి, చుండూరు సర్పంచి వుయ్యూరి అప్పిరెడ్డి, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, ఎంపీడీఓ సుగుణమ్మ, తహసీల్దారు దుర్గ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే కోన రఘుపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. అమృత్ సరోవర్ పథకం ద్వారా మూలపాలెం గ్రామ తాగునీటి చెరువుని అభివృద్ధి పరిచారు. బుధవారం ఎమ్మెల్యే చెరువు శిలాఫలకాన్ని ప్రారంభించి గట్లపై మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు సంవత్సరాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అందులో తాగునీటి చెరువుని సుందరంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచి బొలిమేర అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి అభినందించారు. ఈసందర్భంగా సర్పంచి అనిల్‌కుమార్ మాట్లాడుతూ చెరువు చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, ఇన్, అవుట్‌లేట్, కూర్చోవడానికి బెంచీలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, బాపట్ల రూరల్ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జేఎస్ఎస్ మండల కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, ఆర్‌ఎస్‌డబ్ల్యూ డీఈ శ్రీనివాస్, ఆర్‌ఎస్‌డబ్ల్యూ ఏఈ భాషా, ఏపీఓ కోటయ్య నాయక్ పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాసం పరీక్షలలో విద్యార్థుల సత్తా



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి.మనోజ్ కుమార్

భట్టిప్రోలు: పదో తరగతి విద్యార్థులకు మారిన పరీక్ష విధానంపై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాసం 2023 మోడల్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలులోని టీఎంరావు, సిద్ధార్థ, విశ్వశాంతి, పల్లెకోన జెడ్పీ, సూరేపల్లిలోని వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్స్‌లలో పరీక్షలు రాసిన వారిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్, హెచ్ఎంలు సి. రామకోటేశ్వరరావు, వి.భారతి, పి.ఫణి పార్థసారథి, వి.నాగేశ్వరరావు, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

బాపట్ల అర్బన్: ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భావపూరి పుస్తక ఉద్యమ సమితి ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. సెమినార్‌కు ప్రిన్సిపాల్ మాల్యాద్రి అధ్యక్షత వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు పుస్తకాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శివాజీ గణేషన్, డాక్టర్ పి.సి.సాయిబాబా, మల్లికార్జున పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



అనిల్‌కుమార్ భార్య నాగపావనికు సాయం చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అడిషనల్ కర్పస్ ఫండ్ చెక్కు రూ.లక్షను అతడి భార్య నాగపావనికు ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం అందజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ 2022 అక్టోబర్ 18న అనారోగ్యంతో మరణించారన్నారు. పోలీసుశాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర అన్ని బెనిఫిట్స్‌ను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

రేపల్లె: పశు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం- పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో మండలంలోని లంకెవానిదిబ్బలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు అందించే ఆహారంపై యజమానులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందించారు. అదే విధంగా మండల పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్, మీనాక్షిదేవి 98 పశువులకు వైద్యసేవలు అందించారు. పశుయజమానులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైదులు జగదీష్ కుమార్, హేమ ప్రియ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో అవకాశం

వేమూరు: పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా విద్యనందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. వంద సీట్లుకు గాను 25 సీట్లు పేద విద్యార్థులకు కేటాయించినట్లు వివరించారు. సీట్లు కోసం దరఖాస్తులు ఏప్రిల్ 7వ తేదీ వరకు ఉందన్నారు. గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



కళాశాల యాజమాన్యానికి డ్రగ్స్ అవైర్‌నెస్ ఇనిస్టిట్యూషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సీఐ విజయ చంద్ర తదితరులు

రేపల్లె: మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పట్టణ సీఐ విజయ చంద్ర అన్నారు. 'సంకల్పం- డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్ఫలితాలు తెలుసుకుని ఉండాలన్నారు. డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంతో మెదడుపై, మానసిక ఆరోగ్యంతో పాటు అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యలకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు సంకల్ప కార్యక్రమంలో భాగస్వాములైన కళాశాలకు, కళాశాల యాజమాన్యానికి డ్రగ్స్ అవైర్ ఇనిస్టిట్యూషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థులతో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అబ్దుల్ రజాక్, కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలతో మమేకం కావాలి

ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు



భట్టిప్రోలు పీహెచ్‌సీలో సిబ్బందిని విచారిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు: వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలతో మమేకమై వైద్య సేవలు అందించినప్పుడే వారి నుంచి మన్ననలు పొందగలమని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ల్యాబ్ నిర్వహణ విషయంలో స్పందనలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు అందడంతో బుధవారం విచారణ చేపట్టారు. ఆ రోజు విధి నిర్వహణలో ఉన్న నర్సు మేరి, ఎంఎల్‌హెచ్‌పీ కరీమా, హెచ్ఎస్ ప్రసన్నబాబులను విచారించారు. స్టాఫ్ నర్సు మేరికి మెమో జారీ చేసి ఇటువంటి పొరపాటు జరగకుండా చూసుకోవాలని మందలించారు. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతతో పని చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రమేష్, సూపరింటెండెంట్ మురళి ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత

కొల్లూరు: పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3నుంచి జరగనున్న నేపథ్యంలో అవసరమైన కిట్లను కొల్లూరు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ బుధవారం పంపిణీ చేశారు. 176 మంది విద్యార్థులకు అందించారు. ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతులను మెరుగు పరిచి ప్రతి విద్యార్థికి ఉత్తమమైన విద్యను అందించేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. అనంతవరం పాఠశాలలో 1997–98 బ్యాచ్ విద్యార్థులు.. 70 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు అమిరిశెట్టి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సాంబశివరావు, కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, గరిక రమేష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. నాగపావ, ఉషాకుమారి, ఎం.రాజు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు



రామనవమి వేడుకలకు ముస్తాబైన రైలుపేట పట్టాభిరామస్వామి ఆలయం

రేపల్లె రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని వేడుకలను నిర్వహించేందుకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా రామాలయాలను విద్యుత్‌దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. రైలుపేటలోని పట్టాభి రామస్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, నేతాజీనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయం తదితర ఆలయాలను వైభవంగా అలంకారించారు. ఆయా వీధులలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పాతస్టేట్ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి, పెదకూరగాయల మార్కెట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

బాపట్ల టౌన్: శ్రీ సీతారాముల కల్యాణానికి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఊరంత పండుగలా జరుపుకునే సీతారాముల కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు చేసే పనిలో గ్రామస్తులు గత నాలుగు రోజుల ముందునుంచే నిమగ్నమయ్యారు. ముఖ్యంగా పట్టణంలోని భీమావారిపాలెం, బెస్తపాలెం, చీలురోడ్డు, కాకుమానువారిపాలెం, మున్నంవారిపాలెం, చీలురోడ్డు, ఉప్పరపాలెంతో పాటు మండలంలోని ముత్తాయపాలెం, రామానగర్, ఆదర్శనగర్, అప్పికట్ల, కంకటపాలెం, పాండురంగాపురం గ్రామాల్లో నేడు సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

రక్తదానం ఎంతో గొప్పది

రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి నారాయణభట్టు



రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణభట్టు

బాపట్ల: అన్నిదానాల్లోకి రక్తదానం ఎంతో గొప్పదని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు పేర్కొన్నారు. అచీవర్స్ అగ్రిసెట్ అకాడమీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం స్థానిక మరుప్రోలువారిపాలెంలోని అకాడమీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 80మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా బి.ఎస్.నారాయణభట్టు మాట్లాడుతూ ప్రతి ఏడాది రక్తదానశిబిరం నిర్వహిస్తున్న అచీవర్స్ అగ్రిసెట్ అకాడమీ డైరెక్టర్ సందీప్ వర్మ, నీలిమాలను అభినందించారు. డైరెక్టర్ సందీప్ వర్మ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరమనే ఉద్దేశంతో తాను చదువుకునే రోజుల నుంచి ఇప్పటి వరకు ప్రతి ఏడాది రక్తదానం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకుడు నరేంద్ర పాల్గొన్నారు.

ఐలవరంలో ముగిసిన సప్తాహం

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలోని శ్రీ సీతారామ మందిరంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం కార్యక్రమాలు బుధవారంతో ముగిసింది. కార్యక్రమంలో హేమశంకరరావు, చందలూరి రామకోటేశ్వరరావు, డి.సత్యనారాయణ, జొన్నాదుల సాంబయ్య, అనగాని నాగమ్మ, మాచర్ల. రంగారావు, కేబీవీ రమణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే దివ్యాంగులకు మేలు

బాపట్ల: వైఎస్సార్ సీపీలోనే దివ్యాంగులకు సముచిత స్థానం దక్కుతోందని ఆ పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఉచితంగా రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను ఇవ్వటంపై దివ్యాంగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఉచితంగా ద్విచక్రవాహనాలు బాపట్ల జిల్లాలో 60 మందికి మంజూరు అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రవిశంకర్ రెడ్డి, బొమ్మిశెట్టి మాధవి, రత్నకుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

సీతారాముల పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు

గొరిగపూడి(భట్టిప్రోలు): స్థానిక హనుమ లక్ష్మణ సహిత సీతారామచంద్రస్వామి మందిరంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని స్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయ నిర్వాహకులు గొర్రెపాటి సత్యం దంపతులు, ఆలయ పెద్దల సహకారంతో స్వామి వార్ల పంచలోహ విగ్రహాలను బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమంచి సృజన్ కుమార్ విగ్రహాలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, పంచ కుంభారాధన, వాస్తు గణపతి నవగ్రహ హోమం, పూర్ణాహుతి జరిపించారు.

దాడి కేసులో నిందితులకు జైలు

వేమూరు: దాడి కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తెనాలి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి బుధవారం తీర్పునిచ్చారు. వేమూరు ఎస్ఐ చౌడయ్య అందించిన వివరాలు.. కొల్లిపర మండలం చక్రయపాలేనికి చెందిన డేగల శ్రీనివాస్ కుమార్, చందు మంగమ్మ, అమ్మిశెట్టి ప్రమీణ్ కుమార్, తల్లి వెంకటసుబ్బమ్మ కుటుంబాలకు పూర్వీకుల నుంచి వచ్చిన వ్యవసాయ సాగు భూమి విభజన వివాదం కోర్టులో పెండింగ్ ఉంది. ఇరువురి మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2020లో అమ్మిశెట్టి ప్రవీణ్‌కుమార్, తల్లి వెంకటసుబ్బమ్మ కొల్లిపర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఇంటికి వస్తుండగా వేమూరు మండలం చదలవాడలో పాలిమేర వద్ద దాడి చేశారు. నేరం రుజువుకావడవతో శ్రీనివాస్‌కుమార్‌కు ఐదేళ్లజైలు శిక్ష, రూ.20వేలు జరిమానా, చందు మంగమ్మకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా బాధితులకు రూ.10 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురిపై కేసు

బాపట్ల టౌన్: ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఘటన పిట్టలవానిపాలెం మండలం, సంగుపాలెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్.రాజశేఖర్ కథనం.. సంగుపాలెం గ్రామానికి చెందిన యానిమేటర్ మంగళవారం పిట్టలవానిపాలెంలో నిర్వహించిన ఆసరా సమావేశానికి మహిళలను అధికసంఖ్యలో తీసుకెళ్లారు. గ్రామ సర్పంచిగా ఉన్న మాకు తెలియకుండా మహిళలను ఎందుకు తీసుకెళ్ళారంటూ యానిమేటర్, యానిమేటర్ భర్త కె.శ్రీనివాసరావుతో సర్పంచి కుమారుడు మహేష్ వాగ్వాదానికి దిగాడు. దీంతో పొదుపు సంఘానికి చెందిన సమావేశానికి మహిళలను తీసుకెళ్తే తప్పేంటి అంటూ యానిమేటర్ భర్త నిలదీశారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో యానిమేటర్ భర్త చెవి కొంతభాగం తెగింది. బ్లేడ్‌తో చెవికోశారంటూ ఎస్.శ్రీనివాసరావు, చందోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చందోలు ఎస్ఐ, సర్పంచి ఎనికేపల్లి శివకుమారి, ఆమె తనయుడు మహేష్, యానిమేటర్ భర్త సంకూరు శ్రీనివాసరావులపై కేసు నమోదు చేశారు. మహేష్ పొన్నూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. క్షతగాత్రుడు ఎస్.శ్రీనివాసరావు ప్రస్తుతం గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

యువకుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొల్లూరు: ఓ యువకుడిపై దాడి చేసి ఘటనపై బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక రెడీమేడ్ దుకాణంలో కొత్తమాసు సాయి పనిచేస్తున్నాడు. వేమూరు మండలం పెరవలిపాలేనికి చెందిన ఓ వివాహితకు యువకుడు ఫోన్ చేసి వేధిస్తుండటంతో ఆమె భర్త మంగళవారం రాత్రి కొల్లూరు వచ్చి యువకుడు పనిచేస్తున్న దుకాణంవద్దకు వెళ్లి యువకుడ్ని బయటకు పిలిచాడు. ఇద్దరు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పక్కనే ఉన్న దుకాణంలో అమ్మకానికి ఉంచిన పచ్చడి జాడీతో యువకుడిపై దాడి చేయడంతో సాయి గాయపడ్డాడు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రేపల్లె రూరల్: సారా ద్విచక్ర వాహనంపై నల్లూరు నార్త్ గ్రామానికి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ భరత్‌కుమార్ బుధవారం తెలిపారు. గుడ్డికాయలంక గ్రామానికి చెందిన పడమటి శ్రీనివాసరావు, అతడి తండ్రి నాంచారయ్య 20 లీటర్ల సారాను నల్లూరునార్త్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సారా విక్రయిస్తున్న రేపల్లెకు చెందిన ఆలపాటి కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు 94407 96169 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

నిజాంపట్నం: జూదాలకు పాల్పడితే ఎంతటివారైనా సహించేది లేదని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని అడవులదీవిలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాటాడుతున్న 9 మందిని అదుపులోనికి తీసుకుని రూ.2500, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాటిని అడవులదీవి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవికి అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

తెనాలి రూరల్: పెద్దమొత్తంలో గంజాయిని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి ఐతానగర్ ప్యాడిసన్‌పేట కమ్యూనిటీ హాలు వద్ద ఐలా శ్రీనివాస్, మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి 14.50 కిలోల గంజాయి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు నందులపేటకు చెందిన వారు కాగా నలుగురు ఐతానగర్ వారే. కమ్యూనిటీ హాలు వద్ద కూర్చుని తమ వెంట తెచ్చిన గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా మారుస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.